క్లుప్తంగా

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



సిమెంటు రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

ఒంగోలు: స్థానిక రాజీవ్‌గృహకల్ప కాలనీ 6వ లైనులో సిమెంట్ రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవలే ఈ మార్గంలో కాలువ పనులు పూర్తిచేశారు. తాజాగా 600 మీటర్ల దూరం రూ.40 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. పది రోజుల్లో సిమెంటు రోడ్డు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. 9వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, డివిజన్ ఎమినిటీస్ సెక్రటరీ రాంబాబు, కాంట్రాక్టర్ చంద్రశేఖరరెడ్డి పనులను పర్యవేక్షించారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: మండలంలోని పీ గుడిపాడు నుంచి సంతనూతలపాడు వెళ్లే 3 కి.మీ డొంక రోడ్డును గ్రావెల్ రోడ్డుగా మార్చేందుకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వలన పీ గుడిపాడు నుంచి సంతనూతలపాడుకు రాకపోకలు సౌకర్యవంతంగా ఉంటాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు తానిపర్తి శేషిరెడ్డి, కుంచాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీ పొగాకు గరిష్ట ధర రూ.208



వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈడీ శ్రీధర్ బాబు, బోర్డు మెంబర్ మారెడ్డి సుబ్బారెడ్డి

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో ఈ ఏడాది నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.208 పలికినట్లు పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, బోర్డు మెంబర్ మారెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం వేలం కేంద్రాన్ని వారు పరిశీలించారు. గరిష్ట ధరపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలానికి 763 బేళ్లు రాగా, 714 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. నోబిడ్ బేళ్లు 20 కాగా, కేజీ గరిష్ట ధర రూ.208, కనిష్ట ధర రూ.175, సరాసరి ధర రూ.200.31గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి తెలిపారు.

నగరపాలక సంస్థలో స్పందనకు 9 అర్జీలు



సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ఒంగోలు: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చాయి. ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, శానిటేషన్ విభాగానికి సంబంధించి 2, రెవెన్యూ విభాగానికి సంబంధించి 3, శానిటేషన్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వివరించారు. వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలు వారి సమస్యలను ఫిర్యాదుల రూపంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి తమకు అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

11న ప్రవేశ పరీక్ష

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డి పాలెం ఏపీ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కే హప్సార్ సోమవారం తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే ఆదివారం ఉదయం 8 గంటలకు మోడల్‌స్కూల్‌వద్దకు చేరుకుని హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సామగ్రిని తీసుకురావాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేయని విద్యార్థులను అనుమతించమన్నారు.

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి వెంకారెడ్డి



ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న అధికారులు



మొక్కలకు నీరు పోస్తున్న అటవీశాఖ రేంజ్ అధికారి నాగేంద్రరావు



మొక్కలు నాటుతున్న జడ్జి అమ్మన్నరాజా

● డీసీఈబీ కార్యదర్శి వెంకారెడ్డి

ఒంగోలు: చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) కార్యదర్శి డి.వెంకారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రకాశం జిల్లా విద్యాశాఖ, జిల్లా గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో వెంకారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నుంచి ప్రారంభమై పాఠశాల వరకు, సమాజం వరకు పర్యావరణంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో సమాజాన్ని కాపాడుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని విద్యార్థులను కోరారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి, ఆప్‌కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ టి.రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ బి.తిరుపతయ్య, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, గ్రంథాలయ కార్యదర్శి బి.కోటేశ్వరి, పీవీ రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి : జడ్జి అమ్మన్నరాజా

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించి వినియోగించిన ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసే విధానాన్ని తెలుసుకోవాలని ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.,అమ్మన్నరాజా అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పులకు, భూతాపాలకు, అధిక ఉష్ణోగ్రతలకు విచ్చలవిడిగా చెట్లను నరికివేయడమే కారణమన్నారు. అందువల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.సత్యకుమారి, అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తులు ఎస్.హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యశ్రీనివాసులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైట్ ఆధ్వర్యంలో...

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్విస్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం, ప్రకాశం జిల్లా అటవీశాఖ, సైట్ సౌజన్యంతో క్విస్ కాలేజీలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఫారెస్ట్ రేంజి అధికారి ఏవీ నాగేంద్రరావు పాల్గొని మాట్లాడారు. సమాజంలో జనసాంద్రత పెరుగుతున్న దృష్ట్యా కాలుష్యాన్ని నివారించేందుకు విరివిగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాలేజీలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యతను ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు ఫారెస్ట్ రేంజి అధికారి ఏవీ నాగేంద్రరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.మోహన్‌రావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శశిభూషణ్‌రావు, సైట్ మేనేజర్ శ్రీమన్నారాయణ చేతులమీదుగా ప్రశంసపత్రాలు, బహుమతులు అందించారు.

ప్రతిఒక్కరూ స్పందించాలి : సైట్ సీఈవో బాబూరావు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంపై ప్రతిఒక్కరూ స్పందించాలని సైట్ సీఈవో బి.బాబూరావు పిలుపునిచ్చారు. స్థానిక పాత రిమ్స్‌లోని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేటి పారిశ్రామికీకరణ యుగంలో పర్యావరణం గురించి ఆలోచించడం చాలా ముఖ్యమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ ఆర్.లోకనాథం, మెప్మా పీడీ టి.రవికుమార్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ అధికారి టి.భరద్వాజ్, వయోజన విద్య ఉప సంచాలకుడు పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్లూరులో పర్యావరణంపై ర్యాలీ



అల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో సుజాత, ఈవోఆర్డీ, సచివాలయ సిబ్బంది

అల్లూరు (కొత్తపట్నం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం అల్లూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రావి, మర్రి, చింత, మద్ది, వేప మొక్కలు నాటడం ద్వారా వాయుకాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం మిషన్ లైఫ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. నినాదాలు చేసుకుంటూ సచివాలయం నుంచి బ్యాంక్ బజారు, బస్టాండ్ సెంటర్, ఎస్సీకాలనీ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి ఐవీ రామారావు, హిమబిందు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్లాప్‌మిత్రలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



చీమకుర్తి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న చైర్మన్, కమిషనర్, సిబ్బంది



ఎండ్లూరు డొంక మహిళా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది

● మెప్మా పీడీ రవికుమార్, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ అంకులు, కమిషనర్ ఫజులుల్లా పిలుపు

చీమకుర్తి: ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందామని మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, కమిషనర్ షేక్ ఫజులుల్లా చీమకుర్తి పట్టణ వాసులకు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటికొక మొక్క నాటాలని, తద్వారా ఎండల వేడి తగ్గించుకుని భూగోళం వేడి కూడా తగ్గించుకునేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. దానికి ప్రత్యామ్నాయంగా సింగిల్ యూజర్ కవర్లను వినియోగించుకునే విధంగా ప్రతి షాపు వద్ద ఏర్పాటు చేయనున్న వాల్‌పోస్టర్లను మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

మున్సిపల్ సిబ్బందితో ప్రతి షాపు ఎదుట వాటిని అంటించారు. తొలుత కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి బ్యానర్లను ప్రదర్శించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ, సచివాలయాల సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో పర్యావరణ దినోత్సవం...

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సంతనూతలపాడు ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో ఒంగోలు స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాంగణం మేనేజర్ డీ సుధ, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ షేక్ బాషా, శాంతకుమారి, అంజని పాల్గొన్నారు.

సంతనూతలపాడులో మొక్కలు నాటిన ఎంపీపీ, జెడ్పీటీసీ...

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవం గురించి వివరించి ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం...

మద్దిపాడు: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందు తరాల భవిష్యత్తుకు బాటలు వేద్దామని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస అన్నారు. సోమవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవులు సహజ సిద్ధంగా ఉండే ప్రకృతి వనరులు నాశనం చేస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నారని అన్నారు. ఈ కాలుష్యం కారణంగా పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని ఆమె తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పెంచితే పర్యావరణాన్ని రక్షించుకున్నవారమవుతామని ఆమె పేర్కొన్నారు. వేల సంవత్సరాల పాటు భూమిలో కరిగి పోకుండా ఉండే ప్లాస్టిక్ వలన పర్యావరణానికి పెను ముప్పు రాబోతోందన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకుండా కట్టడి చేయాలని కోరారు. ముందుగా వెల్లంపల్లి గ్రామ సచివాలయంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. అతిసార వ్యాధి చిన్నపిల్లల్లో ఎక్కువగా వస్తుందని, దీనిని నివారించుకోవడానికి చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి రోజు మొత్తం తాగించాలని, వ్యాధి సోకిన చిన్నారులకు జింక్ ట్యాబ్లెట్లు వేయించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హనీఫ్, సీహెచ్‌వో లలితమ్మ, పీహెచ్ఎన్ రజితకుమారి, ఎంపీహెచ్ఈవో వెంకారెడ్డి, ఎంపీహెచ్ఎస్ బాలకోటయ్య, నాగేశ్వరరావు, హౌస్ సర్జన్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



సంతనూతలపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



మద్దిపాడు పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ మానస, సిబ్బంది



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రాంగణంలో సోమవారం జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ప్రారంభించారు. ఏపీ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రియ, రవి తెలిపారు. ఈ సందర్భంగా వెంకారెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ పోటీతత్వాన్ని అలవరచుకోవాలని, క్రీడలకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడానికి కృషి



ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత, జేసీ శ్రీనివాసులు

● మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: ఒంగోలును ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రతిఒక్కరూ ముందుకు రావాలని నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మంగమూరు రోడ్డులో నగరపాలక సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రీన్‌ర్యాలీని జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులుతో కలిసి జెండా ఊపి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తాను మేయర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం ఇంకా తగ్గలేదన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగులను వినియోగించాలన్నారు. పాశ్చాత్య దేశాల్లో తక్కువ దూర ప్రయాణాలకు సైకిల్ వాడకం లేదా నడిచి వెళుతుంటారని, బైకుల వినియోగం తక్కువగా ఉంటుందని అన్నారు. కానీ మన వద్ద తక్కువ దూర ప్రయాణాలకు కూడా బైకులు, కార్లు అధికంగా వినియోగిస్తుండటం కూడా కాలుష్యం పెరిగేందుకు ఒక కారణమని అన్నారు. గ్రీన్ ర్యాలీ మంగమూరు రోడ్డులోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద ప్రారంభమై ఒంగోలు పబ్లిక్ స్కూలు, ఎన్ఎస్‌పీ కెనాల్ రోడ్డు, సమతానగర్ వద్ద ముగిసింది. ర్యాలీ అనంతరం సమతానగర్‌లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ స్టూడెంట్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ నుంచి కళాజాత కళాకారులు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్, పలు పరిశ్రమల ప్రతినిధులు, మెప్మా, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్మోనిస్ట్ సుబ్బారావుకు సత్కారం



సుబ్బారావును సత్కరిస్తున్న కళాకారులు

మోటుమాల (కొత్తపట్నం): ప్రముఖ సీనియర్ హార్మోనిస్ట్, కళాకారుడు కడవ సుబ్బారావును ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకార సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. మండలంలోని మోటుమాల గ్రామంలో నిర్వహించిన సత్కార సభలో ఆంధ్రప్రదేశ్ పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి మిట్నసల శాంతారావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అనేక మందిని కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత సుబ్బారావుకు దక్కుతుందన్నారు. అంతరించుకుపోతున్న పౌరాణిక కళారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ శాతం పౌరాణిక నాటకాల మీదే ఆసక్తి చూపుతారని చెప్పారు. ఇటువంటి సత్కారాలు ఏర్పాటు చేయటం వలన పౌరాణిక రంగం అంతరించుకుపోకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాకారులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రెడ్డి, ప్రభుదాస్, పేరయ్య, తదితరులు పాల్గొని సుబ్బారావును సత్కరించారు.

వలంటీర్లకు సత్కారం



చీమకుర్తి: సంతనూతలపాడు పంచాయతీ పరిధిలోని 56 మంది వలంటీర్లను ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి ఆధ్వర్యంలో సోమవారం సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. శాలువాలు కప్పి ప్రశంసపత్రాలు అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించడంలో వలంటీర్ల సేవలు అమూల్యమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, వైస్ ఎంపీపీ రాగమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల

హనుమంతునిపాడు: మండలంలోని దాసళ్లపల్లిలో దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. సోమవారం కోలాటం, పాటకచేరి, కొర్లబండి కార్యక్రమం, ప్రత్యేక పొంగళ్లు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులు కుంకుమ బండ్లు, పూసల బండ్లు ఏర్పాటు చేసి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కుంకుమ బండ్లను అంకాలమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

పీసీపల్లి: మండలంలోని పెదయిర్లపాడులో అంకాలమ్మ తల్లి తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అంకమ్మతల్లికి అంకసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాళమ్మ తల్లిని సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ప్రజలు భారీగా పాల్గొన్నారు.